బోల్తాపడిన కల్లు వ్యాన్



2



2

ఏడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in


## డిగ్రీ ఫస్టియర్ తరగతులు ప్రారంభం



**అక్షరటుడే, కామారెడ్డి:** ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025-26 విద్యాసంవత్సరం ఫస్టియర్ తరగతులు ప్రారంభమయ్యాయని కళాశాల ప్రిన్సిపాల్ విజయ్ కుమార్ తెలిపారు. విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరుకావాలని సూచించారు. కనీసం 75శాతం హాజరు శాతం ఉండేలా చూసుకోవాలన్నారు. విశేష అనుభవం ఉన్న అధ్యాపకుల సేవలు వినియోగించుకోవాలని సూచించారు. విద్యార్థులు కళాశాలలో వ్యవహరించాల్సిన విషయాలపై ఓరియంటేషన్ ప్రోగ్రాం ప్రతి బుధవారం నిర్వహించనున్నట్లు తెలిపారు.



## ఫిర్యాదుల పరిష్కారానికి చొరవ చూపాలి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్

**అక్షరటుడే, ఇందూరు:** ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి 126 ఫిర్యాదులు అందాయి. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, ట్రైయినీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్మావి, డీఆర్డీవో సాయాగౌడ్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, మెప్మా పీడీ రాజేందర్, నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకట్ రెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ ఛైర్మన్ మానాల మోహన్ రెడ్డి అన్నారు. వేల్పూర్ మండలంలో నిర్మాణంలో ఉన్న ఓ ఇందిరమ్మ ఇంటిని సోమవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో ఇల్లు లేని పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇళ్లు మంజూరు చేసిందన్నారు. ఆయన వెంట పార్టీ మండలాధ్యక్షుడు గడ్డం నర్సారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నరేందర్, దామోదర్ గౌడ్ గ్రామ శాఖ అధ్యక్షుడు మల్లేష్, ఇంద్రమ్మ కమిటీ సభ్యులు రమణ, రాజేందర్ ఉన్నారు.

## ఎడపల్లి ఎస్సైగా రమ బాధ్యతల స్వీకరణ



**అక్షరటుడే, బోధన్:** ఎడపల్లి ఎస్సైగా ముత్యాల రమ బాధ్యతలు స్వీకరించారు. నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో వీఆర్‌లో ఉన్న ఆమె ఎడపల్లి మండలానికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శాంతి భద్రతలకు మొదటి ప్రాధాన్యత ఇస్తానని ఆమె తెలిపారు. ఇక్కడ పని చేసిన ఎస్సై వంశీకృష్ణా రెడ్డి ప్రస్తుతం వీఆర్‌లో ఉన్నారు.

ఉమ్మడి జిల్లాలో పంచాయతీ కార్యదర్శుల పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా మారింది. ఒకవైపు గ్రామాల్లో పాలకవర్గాలు లేకపోవడం.. మరోవైపు ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో అవస్థలు పడుతున్నారు. గ్రామాల్లో వివిధ పనుల నిర్వహణకు డబ్బులు లేక అప్పులు తెచ్చి చేయించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేకాధికారులు పట్టించుకోకపోవడంతో భారమంతా తమపైనే పడుతోందని వాపోతున్నారు.

– అక్షరటుడే, కామారెడ్డి



# నిధులు లేక.. విధులు భారం

■ గ్రామాల్లో పనుల నిర్వహణకు డబ్బులేవ్ ■ పాలకవర్గాలు లేక పట్టించుకునే వారు కరువు ■ జీపీ కార్యదర్శులపైనే పూర్తి భారం ■ అప్పులు చేసి పనులు చేయిస్తున్న వైనం ■ ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని వేడుకోలు

ఉమ్మడి జిల్లాలో వెయ్యికి పైగా గ్రామ పంచాయతీలు ఉన్నాయి. నిజామాబాద్ జిల్లాలో 545 పంచాయతీలు, కామారెడ్డి జిల్లాలో 537 జీపీలు ఉన్నాయి. గ్రామ పంచాయతీ పాలక వర్గాల పదవీకాలం పూర్తయి ఏడాదిన్నర అవుతోంది. దీంతో ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. కానీ వారు తమకు కేటాయించిన గ్రామాలవైపు కన్నెత్తి చూడకపోవడంతో పల్లెల్లో పనుల నిర్వహణ భారం అంతా వారిపైనే పడింది.

### అప్పులు తెచ్చి మెయింటెనెన్స్

గ్రామాల్లో ప్రతి రోజూ ఖర్చులతో కూడుకున్న పనులు ఉంటాయి. రోజువారి కూలి ఇస్తే తప్ప కొందరు పని చేయలేని పరిస్థితులు ఉంటాయి. అయితే ప్రస్తుతం నిధులు లేక పంచాయతీ కార్యదర్శులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో ప్రతిరోజు చెత్త సేకరణ చేపట్టడానికి వాడే ట్రాక్టర్‌కు డీజిల్, మురికి కాల్వల నిర్వహణ, లీకేజీలు, మోటార్ రిపేర్లు, ఇతరాత్ర పనులకు కచ్చితంగా ప్రతిరోజూ డబ్బులు కావాల్సిందే. ఇవన్నీ చేయకపోతే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చే అవకాశం ఉంటుంది. దీంతో చేసేదేమీ లేక పంచాయతీ కార్యదర్శులు బయట నుంచి అప్పులు తెచ్చి మరీ పనులు చేయిస్తున్నారు. కొందరు బయట వడ్డీలకు తీసుకువస్తే మరికొందరు ఇంట్లోని బంగారాన్ని తాకట్టు పెట్టి మరీ డబ్బులు తెచ్చి పంచాయతీల మెయింటెనెన్స్ కోసం ఉపయోగిస్తున్నారు. ఇప్పటికే ఒక్కో పంచాయతీ కార్యదర్శి దాదాపు రూ.3 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు అప్పులు తెచ్చినట్లు తెలుస్తోంది.

### నిధుల కోసం వేడుకోలు

గ్రామాల్లో పంచాయతీ పాలక వర్గాలు ఉంటే కేంద్రం నుంచి 15వ ఫైనాన్స్ నిధులు వచ్చే అవకాశం ఉండేది. ప్రస్తుతం ఏడాదిన్నరగా నిధులు నిలిచిపోయాయి. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వమే నిధులను పంచాయతీలకు సమకూర్చాల్సి ఉంటుంది. అయితే ప్రభుత్వం నుంచి నిధులు రావడం లేదని తెలుస్తోంది. ఈ క్రమంలో ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని పంచాయతీ కార్యదర్శులు కోరుతున్నారు.



### నిధులు విడుదల చేయాలి



ఏడాదిన్నరగా గ్రామ పంచాయతీల్లో పాలకవర్గాలు లేవు. పంచాయతీల మెయింటెనెన్స్ ఇబ్బందికరంగా మారింది. ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు రావడం లేదు. ఫలితంగా బయట అప్పులు తెచ్చి ఖర్చులు పెడుతున్నాం. ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేయాలి.

-మహేశ్‌గౌడ్, జీపీ కార్యదర్శుల కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు

## మహిళల ఆర్థికాభివృద్ధికి పెద్దపీట

**అక్షరటుడే, కామారెడ్డి:** మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్ నాయక్ అన్నారు. కామారెడ్డి పట్టణంలోని మహిళా సమాఖ్య భవనంలో మహిళా శక్తి ప్రగతిపై సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఇప్పటివరకు సంఘాలలో లేని 8,800 మంది మహిళలను గుర్తించి సంఘాలలో చేర్పించడం జరిగిందన్నారు. మహిళా శక్తి కార్యక్రమం కింద మహిళా సంఘ సభ్యులతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫామ్స్ కుట్టించడం ద్వారా వారికి ఉపాధి కల్పించడం జరిగిందన్నారు. 183 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు మహిళా సంఘాలకు అప్పగించి.. వారి ద్వారా రూ.3కోట్ల విలువ గల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందన్నారు. పాడి గేదెలు, మదర్ యూనిట్స్, పెరటి కోళ్ల పెంపకం, పాల ఉత్పత్తుల కేంద్రాలు, మహిళా శక్తి క్యాంటీన్లు, సోలార్ ప్లాంట్లు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా జిల్లా మహిళా సమాఖ్య భవన నిర్మాణం కోసం రూ.5 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. ప్రస్తుతం భవనం నిర్మాణంలో ఉందని చెప్పారు. 2025-26 సంవత్సర కార్యాచరణ ప్రణాళికలో భాగంగా పెట్రోల్ బంకులు, గోదాములు, రైస్ మిల్లులు, ఆర్టీసీ బస్సుల నిర్వహణ మహిళా సంఘాలకు అప్పగించే యోచనలో ప్రభుత్వం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్డీవో సురేందర్, అదనపు డీఆర్డీవో విజయలక్ష్మి, డీపీఎంలు, స్త్రీనిధి ఆర్ఎం, ఏపీఎంలు, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు పుష్ప, కార్యదర్శి, రాజమణి, కోశాధికారి లక్ష్మి, ఆయా మండల సమాఖ్యల అధ్యక్షులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చందర్‌నాయక్

## మహిళా కానిస్టేబుళ్లు అన్ని విధాలుగా శిక్షణ పొందాలి



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** మహిళా కానిస్టేబుళ్లు ప్రస్తుత పరిస్థితులకు తగ్గట్లుగా అన్ని విధాలుగా శిక్షణ పొందాలని సీపీ సాయిచైతన్య సూచించారు. నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో మహిళా కానిస్టేబుళ్లకు వివిధ అంశాల్లో శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఘటనలు జరిగినప్పుడు మహిళా కానిస్టేబుళ్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. తమను తాము రక్షించుకుంటూ ప్రజలను రక్షించే ఘటనల్లో చురుకుగా పాల్గొనేందుకు ఈ శిక్షణ ఉపయోగపడుతుందని తెలిపారు. వివిధ క్రీడాంశాల్లో శిక్షణ పొందడం ద్వారా మహిళా కానిస్టేబుళ్లలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో ఎలా ప్రవర్తించాలని అనే విషయాల్లో శిక్షణ తప్పనిసరి అని పేర్కొన్నారు. వారంరోజుల పాటు నిర్వహించే శిక్షణను ప్రతి మహిళా సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నిజామాబాద్ అదనపు డీసీపీ (ఏఆర్) రామ చంద్రరావు, ఏసీపీ రాజా వెంకట్ రెడ్డి, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు సతీష్, శేఖర్ బాబు, ప్రభుత్వ స్కూళ్ల టీచర్లు సంతోషి, అనిత, రజని తదితరులు పాల్గొన్నారు.

## పురుగుల అన్నం పెడుతున్నారని.. రోడ్డెక్కిన విద్యార్థినులు



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** పురుగుల అన్నం పెడుతున్నారని నిరసిస్తూ విద్యార్థినులు ఆందోళనకు దిగారు. ఎల్లారెడ్డి గిరిజన బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు సోమవారం ఎల్లారెడ్డి – బాన్సువాడ ప్రధాన రహదారిపై భైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నం తినేటప్పుడు తరచుగా పురుగులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై పలుమార్లు ప్రిన్సిపల్, అధ్యాపకుల దృష్టికి తీసుకు వెళ్లినప్పటికీ వారు ఏమాత్రం పట్టించుకోవడంలేదని వాపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డి తహశీల్దార్ ప్రేమ్ కుమార్ రోడ్డుపై భైఠాయించిన విద్యార్థినులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు. అనంతరం గిరిజన బాలికల పాఠశాలను జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) విక్టర్ పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల సమస్యలను తెలుసుకుని త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహశీల్దార్ ప్రేమ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ మహేష్, ఎంఈవో రాజులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ వర్సిటీలో జాబ్‌మేళా

**అక్షరటుడే, ఇందల్వాయి:** తెలంగాణ యూనివర్సిటీ, హెటిరో కంపెనీ ఆధ్వర్యంలో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు వర్సిటీ కెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ బి సాయిలు పేర్కొన్నారు. ఈనెల 9న తెయూలో గ్లోబల్ ఫార్మసిటికల్స్ కంపెనీ హెటిరో ఆధ్వర్యంలో రాత, మౌఖిక పరీక్షలు నిర్వహిస్తారన్నారు. తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో ఎమ్మెస్సీ కెమిస్ట్రీ పూర్తి చేసిన వారితో పాటు ఈ ఏడాది ఫైనలియర్ విద్యార్థులు ఈ ఉద్యోగ భర్తీ కార్యక్రమానికి హాజరుకావచ్చని ఆయన పేర్కొన్నారు.



## గుంతల రోడ్డు.. వరినాట్లు వేసి నిరసన

కామారెడ్డి పట్టణంలోని కొత్త బస్టాండ్ నుంచి కలెక్టరేట్ వెళ్లే రహదారిపై భారీగా గుంతలు ఏర్పడ్డాయి. దీంతో అశోక్‌నగర్ కాలనీ వాసులు ఆందోళనకు దిగారు. రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంతలో నాట్లు వేసి వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాలనీవాసులను మాట్లాడుతూ రోడ్డుపై గుంతలు ఏర్పడడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గుంతల్లో నీళ్లు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. అధికారులు స్పందించి రోడ్డు వేయాలని కోరారు. – అక్షరటుడే, కామారెడ్డి

## కామారెడ్డి సమగ్రాభివృద్ధికి పటిష్ట చర్యలు

**అక్షరటుడే, నిజాంసాగర్ /బిచ్కుంద:** కామారెడ్డి జిల్లా సమగ్రాభివృద్ధికి పటిష్ట చర్యలు ప్రభుత్వం తీసుకుంటుందని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు. జిల్లాలోని జుక్కల్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు క్యాంప్ కార్యాలయంలో సంక్షేమ పథకాలపై కలెక్టర్, పలు ఉన్నతాధికారులతో కలిసి మంత్రి సమీక్ష నిర్వహించారు. విద్యుత్ లైన్ సమస్యలు, సాగు నీటి ప్రాజెక్టులు, వైద్య ఆరోగ్య సేవలు, వ్యవసాయం, ఇందిరమ్మ ఇళ్ల పురోగతి, మిషన్ భగీరథ తాగునీటి సరఫరా, అటవీ భూముల ఆక్రమణల, మహిళా సంఘాలకు రుణాలు వంటి పలు అంశాలను మంత్రి సుదీర్ఘంగా సమీక్షించారు. జిల్లాలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరారు. స్పందించిన మంత్రి డిప్యూటీ సీఎంతో మాట్లాడి సబ్ స్టేషన్ మంజూరు అయ్యేలా కృషి చేస్తానని మంత్రి పేర్కొన్నారు. నీటి పారుదల ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ కాల్వ నిర్మాణ పనులు, అవసరమైన భూసేకరణ పనుల పరిపాలన అనుమతులు మంజూరు చేయాలన్నారు. కామారెడ్డి జిల్లా జుక్కల్ ప్రాంతంలో 100 పడకల ఆస్పత్రికి ప్రతిపాదనలు పంపాలని మంత్రి కోమటిరెడ్డి ఆదేశించారు. వ్యవసాయ విస్తరణ అధికారులు క్రాప్ బుకింగ్ పకడ్బందీగా చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్లు దశల వారిగా అర్హులందరికీ అందుతాయని తెలిపారు. జిల్లాలో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లు త్వరగా గ్రౌండింగ్ చేసి నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా చూడాలన్నారు. ఆయన వెంట ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్యేలు లక్ష్మీ కాంతారావు, పటోళ్ల సంజీవ్ రెడ్డి, సబ్ కలెక్టర్ కిరణ్మయి, జాయింట్ కలెక్టర్ విక్టర్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి కోమటిరెడ్డి



## ‘ఈ ఆరోగ్యం’లో కామారెడ్డి జిల్లా ఫస్ట్

**అక్షరటుడే, కామారెడ్డి:** జిల్లాస్థాయి ఈఆరోగ్యం ఆన్‌లైన్ అప్లికేషన్ నమోదు ర్యాంకులో జూన్ నెలలో కామారెడ్డి జిల్లా మొదటి స్థానంలో ఉందని జిల్లా వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈఆరోగ్యం అనే ఆన్‌లైన్ అప్లికేషన్‌లో రోజువారీగా ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చిన రోగులు, రోగ నిర్ధారణ పరీక్షకు వచ్చిన ప్రజలు, ఔషధాల నిమిత్తం వచ్చిన ప్రజల వివరాలను నమోదు చేస్తారన్నారు.

జిల్లాలోని 22 ప్రభుత్వ ఆస్పత్రుల్లో నమోదైన వివరాలను వెల్లడించారు. ఆస్పత్రికి చికిత్స నిమిత్తం సంప్రదించిన వారి సంఖ్య 25,152, వైద్యుడిని సంప్రదించిన వారు 23,723, రోగ నిర్ధారణ పరీక్షలు చేసుకున్న వారు 5,232, ఔషధ సేవలను వినియోగించుకున్న వారి సంఖ్య 21,539గా నమోదైనట్లు తెలిపారు. ఈ గణాంకాల ప్రకారం సగటున ఒక రోజుకి 1,007 మంది ప్రజలు ప్రభుత్వాస్పని వినియోగించుకున్నారని పేర్కొన్నారు. ఈ గణాంకాల ప్రకారం రాష్ట్రంలో జూన్ 2025 నెలకు వెలువరించిన జిల్లా ర్యాంకులలో కామారెడ్డి మొదటి స్థానంలో ఉందన్నారు. జిల్లా ప్రజలు ప్రభుత్వ ఆస్పత్రి సేవలను తప్పకుండా వినియోగించుకోవాలని సూచించారు.

## నూతన ఎస్సైకి సన్మానం


**అక్షరటుడే, లింగంపేట:** లింగంపేట్ మండల ఎస్సైగా దీపక్ కుమార్ బాధ్యతలు చేపట్టారు. దీంతో సోమవారం కాంగ్రెస్ యువజన నాయకులు పలువురు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ కార్యదర్శి రాందాస్, రాజేశ్వర్ గౌడ్, లింగంపేట మండల అధ్యక్షుడు రామకృష్ణ గౌడ్, మైనారిటీ అధ్యక్షుడు ఇర్ఫాన్, సంగమేశ్వర్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ ముట్టడికి విద్యార్థుల యత్నం



**అక్షరటుడే, కామారెడ్డి:** ఫీజ్ రీయింబర్స్‌మెంట్ , స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు ఆందోళన బాట పట్టారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌ను ముట్టడించేందుకు సోమవారం యత్నించారు. పోలీసులు విద్యార్థులను ధర్నాచౌక్ వద్దే అడ్డుకున్నారు. దీంతో వారు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేష్ మాట్లాడుతూ.. గత ఐదేళ్లుగా స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు ఇచ్చిన హామీలపైనే దృష్టి పెట్టిందని, విద్యారంగ సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. విద్యాశాఖ సీఎం వద్ద ఉందని, వెంటనే రూ. 8వేల కోట్ల బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బకాయిలు విడుదల కాకపోవడంతో సర్టిఫికెట్లు ఇవ్వడానికి కళాశాలల యాజమాన్యాలు ఇబ్బందులకు గురి చేస్తున్నాయని వాపోయారు.

## చేపల వేట నిషేధంపై ఆదేశాలు బేఖాతరు



**అక్షరటుడే, నిజాంసాగర్:** నిజాంసాగర్ రిజర్వాయర్‌లో అధికారులు జులై, ఆగస్టు నెలల్లో చేపల వేటను నిషేధించారు. కానీ, కొందరు మత్స్యకారులు అధికారుల ఆదేశాలను పట్టించుకోవడం లేదు. ఉదయం, రాత్రి వేళల్లో మత్స్యకారులతో పాటు ఇతరులు ప్రాజెక్టులో చేపలు పడుతున్నారు. రెండు నెలల పాటు చేపలను పడితే చిన్న చేపలు చనిపోయి, మత్స్యకార్మికుల జీవనోపాధిపై ప్రభావం పడుతుందని నిషేధం విధించారు. కానీ, కొందరు ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారు. అధికారులు ప్రాజెక్టు వద్ద పర్యవేక్షణ చేయాలని పలువురు కోరుతున్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

**అక్షరటుడే, బోధన్:** ఎడపల్లి మండలం దూపల్లి గేట్ వద్ద సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రమాదంలో ఒక వ్యక్తి దుర్మరణం చెందగా.. మరో మహిళ తీవ్రంగా గాయపడింది. ఎడపల్లి ఎస్సై రమ తెలిపిన వివరాల ప్రకారం.. రెంజల్ మండలం బాగేపల్లి గ్రామానికి చెందిన భార్యాభర్తలు రాములు, ఇంద్ర కలిసి బైకుపై నిజామాబాద్‌కు వెళ్లి తిరిగి వస్తున్నారు. వారు దూపల్లి గేట్ వద్దకు రాగానే.. రోడ్డు దాటుతున్న క్రమంలో అతివేగంగా వచ్చిన కారు బైక్‌ను ఢీకొట్టింది. దీంతో రాములు అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా.. రాములు భార్య ఇంద్ర పరిస్థితి విషమంగా ఉంది. ఆమెను జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## కల్లు వ్యాన్ బోల్తా.. పలువురికి గాయాలు



**అక్షరటుడే, బోధన్:** కల్లును తీసుకెళ్తున్న ఓ వ్యాన్ రహదారిపై బోల్తాపడగా పలువురికి గాయాలయ్యాయి. ఈ టన నవీపేట్ మండలంలోని ప్రధాన రహదారిపై చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కల్లు సీసాలతో వెళ్తున్న ఓ వ్యాన్ నాగేపూర్ నుంచి యంచ వెళ్తుండగా మిట్టాపూర్ శివారులో బోల్తా పడి పల్టీలు కొట్టింది. దీంతో వ్యాన్‌లో ఉన్న ముగ్గురు కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రులను 108 అంబులెన్సులో జిల్లా కేంద్రంలోని జీజీహెచ్‌కు తరలించారు. రోడ్డు కల్లుపెట్టెలు, సీసాలు పడడంతో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

## గంజాయి విక్రయిస్తున్న బాలుడి అరెస్ట్

**అక్షరటుడే నిజామాబాద్ సిటీ:** గంజాయి విక్రయిస్తున్న మైనర్ బాలుడిని పోలీసులు పక్కా సమాచారంతో అరెస్ట్ చేశారు. నాలుగో టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లమ్మగుట్ట వంతెన వద్ద ఓ మైనర్ బాలుడు గంజాయి విక్రయిస్తున్నాడనే సమాచారంతో అతడిని తనిఖీ చేశారు. అతడి వద్ద గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.









## తడిసిన ఇందూరు

**నిజామాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం ఉదయం ఆకాశం మేఘావృతమైంది. మధ్యాహ్నం సమయంలో వర్షం కురిసింది. ఈ సమయంలో వాహనదారులు, రెయిన్ కోట్లు ధరించి తమ గమ్యస్థానాలకు చేరుకున్నారు. పాదచారులు గొడుగులు పట్టుకుని వెళ్లారు. స్కూల్ విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు.**


**– అక్షరటుడే, స్టాఫ్ ఫొటోగ్రాఫర్**

## నకిలీ మందులు అమ్మితే కఠిన చర్యలు



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నకిలీ మందులు అమ్మితే ఎంతటివారైనా కఠినచర్యలు తీసుకుంటామని ఔషధ నియంత్రణ పరిపాలన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నర్సయ్య హెచ్చరించారు. నగరంలోని ఎల్లమ్మగుట్ట కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ భవన్‌లో సోమవారం జిల్లాలోని మెడికల్ ఏజెన్సీల నిర్వాహకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తాము చేస్తున్న వ్యాపారాన్ని చట్టబద్ధంగా నిర్వహించాలని, అధిక లాభాలకు ఆశపడి నకిలీ మందులు అమ్మి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడవద్దని సూచించారు. అలాచేస్తే మందుల వ్యాపారంపై ప్రజల్లో నమ్మకం పోతుందని హెచ్చరించారు.నార్కోటిక్ డ్రగ్స్, అబార్షన్ కిట్లను సంబంధిత నర్సింగ్ హోంలలోనే అమ్మాలని జనరల్ షాపుల్లో ఎట్టిపరిస్థితుల్లో అమ్మవద్దని ఏడీ నర్సయ్య సూచించారు. విక్రయించిన డ్రగ్స్‌కు సంబంధించిన వివరాలను ప్రతినెలా 3న డ్రగ్స్ కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు శ్రీకాంత్, శ్రీలత, కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నల్ల మధుసూదన్, ప్రధాన కార్యదర్శి బీర్కూర్ సుధాకర్, కోశాధికారి సాయిలు పాల్గొన్నారు.

## అధికారులకు సమ్మె నోటీస్..



**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఆశా వర్కర్లు మెడికల్ ఆఫీసర్ ఫాతిమాకు సమ్మె నోటీసు అందజేశారు. ఈనెల 9న సార్వత్రిక సమ్మె నేపథ్యంలో తాము పాల్గొంటున్నట్లు సోమవారం నోటీసు అందజేశారు. సీఐటీయూ మండల కన్వీనర్ కూతాడి ఎల్లయ్య మాట్లాడుతూ.. కార్మికుల హక్కులను కాలరాసేలా ఉన్న లేబర్ కోడ్‌ల రద్దు కోసం సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చినట్లు పేర్కొన్నారు. కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆశా వర్కర్లకు సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ యూనియన్ అధ్యక్షురాలు భాగ్య, స్వప్న, అనిత, స్వరూప, తదితరులు పాల్గొన్నారు.

## రీయింబర్స్‌మెంట్ కోసం అర్ధనగ్న ప్రదర్శన




**అక్షరటుడే, ఆర్మూర్ :** విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని అఖిల భారత ప్రగతిశీల విద్యార్థి సంఘం డివిజన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో సోమవారం అర్ధ నగ్న ప్రదర్శన నిర్వహించారు. జిల్లా కార్యదర్శి అనిల్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో మూడేళ్లుగా విద్యార్థులకు రూ.7500 కోట్లకు పైగా స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, గత ప్రభుత్వంలాగే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తోందన్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే విడుదల చేయాలని, లేనిపక్షంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రుల ఇళ్లు ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి గోపాల్ సింగ్ ఠాగూర్, నాయకులు శివ, గణేష్, సూర్య, పాల్ పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి




**అక్షరటుడే, బోధన్:** యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పట్టణ సీఐ వెంకట నారాయణ అన్నారు. పట్టణంలోని విద్యా వికాస్ జూనియర్ కళాశాలలో మాదక ద్రవ్యాల నియంత్రణపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై వివరించారు. మైనర్లు వాహనాలు నడుపవద్దని సూచించారు. కళాశాలల్లో ర్యాగింగ్ వంటి కార్యకలాపాలకు పాల్పడవద్దని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## 9న విద్యుత్ ఉద్యోగుల విధుల బహిష్కరణ



**అక్షరటుడే, ఇందూరు:** విద్యుత్ సంస్థలను కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయాలనే నిర్ణయానికి వ్యతిరేకంగా ఈనెల 9న విధుల బహిష్కరణ చేపట్టనున్నట్లు జిల్లా విద్యుత్ ఉద్యోగుల జేఏసీ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఎస్ఈ రవీందర్‌కు నోటీసులు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. జాతీయ కో-ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ అండ్ ఇంజినీర్స్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా విధుల బహిష్కరణ చేపడుతున్నామన్నారు. కాబట్టి ఉద్యోగులు ఇంజినీర్లు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. వినతిపత్రం అందించిన వారిలో జేఏసీ ఛైర్మన్ రఘునందన్, కో-ఛైర్మన్ పూదరి గంగాధర్, కన్వీనర్ బాలేష్‌కుమార్, కో-కన్వీనర్ తోట రాజశేఖర్, 1104 జిల్లా అధ్యక్షుడు రాజేందర్, ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ జిల్లా కార్యదర్శి గంగారాం నాయక్ ఉన్నారు.

## పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నిజామాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను రైల్వే పోలీసులు బాధితులకు సోమవారం అందజేశారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పదకొండు ఫోన్లను రికవరీ చేశామని రైల్వే ఎస్సై సాయరెడ్డి పేర్కొన్నారు. ఫోన్ల రికవరీలో చురుకుగా స్పందించిన సిబ్బంది సుప్రియ, సలావుద్దీన్‌ను ఎస్సై అభినందించారు.




## డ్రంకన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు శిక్ష

**అక్షరటుడే, బోధన్:** మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన కేసులో ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు సీఐ వెంకటనారాయణ తెలిపారు. పట్టణానికి చెందిన భరత్‌తో పాటు మండలంలోని ఎత్తొండ గ్రామానికి చెందిన లక్ష్మయ్య డ్రంకన్ డ్రైవ్‌లో పోలీసులకు పట్టుబడ్డారు. దీంతో వారికి కౌన్సెలింగ్ నిర్వహించి సోమవారం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పర్చగా, న్యాయమూర్తి శేష తల్పసాయి విచారించారు. నిందితులిద్దరికి రెండురోజుల జైలు శిక్ష విధించినట్లు సీఐ తెలిపారు.

## బీజేపీ నాయకుల ముందస్తు అరెస్ట్

**అక్షరటుడే, నిజాంసాగర్:** జుక్కల్ నియోజకవర్గంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో మండలంలోని బీజేపీ నాయకులను ముందస్తు అరెస్ట్ చేశారు. బీజేపీ నాయకులు మంద ధర్మరాజు, నవీన్‌రెడ్డి, కాశీనాథ్, నర్మల రాజు తదితరులను అరెస్ట్ చేసి నిజాంసాగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.



## ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



**అక్షరటుడే నిజాంసాగర్:** పెద్ద కొడప్‌గల్ మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి సోమవారం నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు భూమయ్య, నియోజకవర్గ ఎస్సీ సెల్ ఛైర్మన్ సౌదాగర్ అర్వింద్, మండల అధ్యక్షుడు రవీందర్, ఉపాధ్యక్షుడు బలరాం, పిట్లం మండల అధ్యక్షుడు మహిపాల్, శివాజీ, సాయిలు, శ్రీనివాస్, రాంచందర్, అంబయ్య, గంగాధర్, నాందేవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఏడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



**అక్షరటుడే, కోటగిరి:** పోతంగల్ మండలం కొడిచెర్ల మంజీర శివారు నుంచి అక్రమంగా తరలిస్తున్న 7 ఇసుక ట్రాక్టర్లు, ఒక ట్రాలీని, ఒక పట్టుకున్నట్లు ఎస్సై సునీల్ తెలిపారు. ఆదివారం రాత్రి ఇసుక తరలిస్తున్నారన్న సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి మైనింగ్ అధికారులకు అప్పగించినట్లు చెప్పారు. ట్రాక్టర్ల డ్రైవర్లు, ట్రాక్టర్ల యజమానులపై కేసులు నమోదు చేశామన్నారు.

## పది గంటల పని జీవోను వెనక్కి తీసుకోవాలి



**అక్షరటుడే, బోధన్:** కార్మికులు పది గంటలు పని చేసేలా తెచ్చిన జీవోను వెంటనే వెనక్కి తీసుకోవాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ధర్నా చేపట్టాలరు. ఈ సందర్భంగా పనిగంటలు పెంచుతూ తెచ్చిన జీవో ప్రతులను దహనం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గతంలో నిర్ణయించిన మాదిరిగానే కార్మికులకు 8 గంటల పని సమయాన్ని కొనసాగించాలని, పది గంటలకు పెంచుతూ తెచ్చిన జీవోను ఉపసంహరించుకోవాలన్నారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు మల్లేష్, శంకర్ గౌడ్, వరదయ్య, తదితరులు పాల్గొన్నారు.